www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 30 మే 2025

5

చిత్తూరు

జిల్లాలో పచ్చదనం పెంచాలి

మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయండి: కలెక్టర్

ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు): జూన్ నెలలో జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి అటవీ, డ్వామా, వ్యవసాయశాఖల అధికారులు సమన్వయ చేసుకొని ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో డిఎఫ్ఓ భరణి, సామాజిక అటవీశాఖ అధికారి జ్ఞానప్రకాష్, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణతో కలసి జూన్, జులై నెలలో జిల్లాలో మొక్కల నాటే కార్యక్రమానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున పచ్చదనం పెంపొందించుటకు జిల్లాలో జూన్, జులై రెండు నెలలో జిల్లాలోని ప్రభుత్వ భూములలోను, రోడ్ల ఇరువైపులా మొక్కలు నాటడానికి అటవీ, డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న నర్సరీల కేంద్రాలను డిఎఫ్ఓ, డ్వామా పీడీ, ఏపీడీలు, జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీలు ముందుగా వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. డ్వామా ద్వారా ఏపీడీలు, ఫెల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు వ్యవసాయశాఖ ద్వారా ఏడీలు, ఏవోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకొని వారి పరిధిలో ఉన్న మండల, గ్రామస్థాయిలో రైతులతో మాట్లాడి వారికి అవసరమైన వివిధ రకాల మొక్కలు పంపిణీకి సంబంధించి వివరాలను సిద్ధం చేయాలన్నారు. మండలా పరిధిలో రెండు, మూడు చోట్ల మొక్కలు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో మొక్కలు పంపిణీ కేంద్రాల ప్రాంతాల సమాచారాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలని అన్నారు. రైతులకు అవసరమైన వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేయాలన్నారు. డ్వామా, వ్యవసాయ శాఖల ద్వారా మొక్కలు పంపిణీకి అవసరం ఎంత ఉందన్న పూర్తి వివరాలను సామాజిక అటవీ శాఖ అధికారికి అందజేసిన తర్వాత వారు మొక్కలను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అటవీ శాఖ ద్వారా నిర్వహిస్తున్న నర్సరీల కేంద్రాల ఉన్న ప్రాంతాల వివరాలను డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఉపాధి చట్టం ద్వారా ప్రభుత్వ భూముల్లోను, రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు.

టీచర్ల బదిలీలు ప్రారంభం

డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల సందడి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఉపాధ్యాయుల బదిలీ గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు పరిశీలించారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు ఉపాధ్యాయులకు అవసరమైన సహాయసహకారాలు అందించారు. ఒకే పాఠశాలలో ఐదు సంవత్సరాలు పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఎనిమిది సంవత్సరాలు పనిచేసిన ఉపాధ్యాయులను ప్రస్తుతం నిర్వహిస్తున్న బదిలీల ప్రక్రియలో ఇతర ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు. ఒకే పాఠశాలలో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14,615 మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు పనిచేస్తున్నారు. 80 శాతం శారీరక వైకల్యం కలిగిన ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రథమ ప్రాధాన్యత 20 ఉన్నారు. అలాగే 75 శాతం దృష్టిలోపం కలిగిన ఉపాధ్యాయులు 70 నుంచి 79 శాతం శారీరక అంగవైకల్యం ఉన్న వారితో పాటు 70 శాతం వినికిడి లోపం ఉన్నవారికి ద్వితీయ ప్రాధాన్యత బదిలీల్లో పొందనున్నారు.

ఈ కోవలోకి కేన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వితంతువులు, కిడ్నీ వ్యాధులతో డయాలసిస్ చేసుకుంటున్నా వారు వస్తారు. ఉపాధ్యాయ బదిలీల్లో ఏడు పాయింట్లు అదనంగా పొందే ఉపాధ్యాయుల కోవలోకి 40 శాతం సృష్టిలోపం, 56 నుండి 59 శాతం అంగవైకల్యం కలిగిన వారు పొందుతారు. 42, 45శాతం వినికిడి లోపం, భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారికి ఐదు పాయింట్లు పొందనున్నారు. గురువారం ప్రారంభమైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం కూడా కొనసాగనుంది.

ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

విద్యుత్ వైర్ల సాకుతో చెట్లు నరికివేత

ఓ వైపు పచ్చదనం పెంచాలని ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. మరో వైపు కరెంట్ వైర్లు, లైన్లు సాకు చెట్లను విద్యుత్తు శాఖ అధికారులు నరికేస్తున్నారు. ప్రభుత్వాల శాఖల మధ్య సమన్వయ లోపంతో పెరిగిన చెట్లను నరుకుతున్నారు..

ప్రజాశక్తి- గంగవరం

గంగవరం మండలం పరిసరాల్లో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు లైన్లు సాకు చూపుతూ రహదారులకు ఇరువైపులా బాగా పెరిగిన చెట్లను విద్యుత్ అధికారులు తొలగించడం శోచనీయమని వాహనాదారులు, పాదచారులు అంటున్నారు. గ్రామీణ రహదారులలో ఇరువైపులా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనసంరక్షణ కాలుష్య నివారణలో భాగంగా పలు స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రభుత్వ రహదారికి ఇరువైపులా లక్షల రూపాయలు ఖర్చు చేసి చెట్లను పెంచారు. మరిన్ని చెట్లను నాటి సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంచాలని ప్రభుత్వం ఓ వైపు ప్రకటనలు చేస్తూ, పలు కార్యాక్రమాలను నిర్వహిస్తోంది. అయితే కొన్ని చోట్ల అడ్డుగా ఉన్నాయని సాకులు చూపుతూ రోడ్లకు ఇరువైపులా నీడనిస్తున్న భారీ వృక్షాలను సైతం నరికేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉండటం వలన వాహనదారులు, పాదచారులు ప్రయాణించేటప్పుడు వాటి వలన చల్లదనంతో పాటు ఆహ్లాదకరమైన గాలికూడా ఉండేదని, ప్రస్తుతం కరెంట్ లైన్లు లాగాలని రోడ్డుకు ఇరువైపులా వేపుగా పెరిగిన చెట్లను నరికేయడం బాధగా ఉందని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. ఏది ఏమైనా చెట్లను నరివేయడంలో అధికారులు చూపుతున్న శ్రద్ధ తిరిగి మరిన్ని చెట్లను నాటి పెంచడంలోనూ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కరెంట్ లైన్లకు అడ్డు అని నరికేసిన చెట్లు

మహానాడుకు ఆర్టీసీ బస్సులు

- సామాన్యులకు తప్పని తిప్పలు
- ఆగ్రహిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం

ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేక జనం ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ అవస్థలు పడుతున్నారు. తెలుగుదేశం పార్టీ కడప జిల్లాలో ఏర్పాటు చేసిన మహానాడుకు ఆర్టీసీ బస్సులను మళ్లించారు. దీంతో ప్రజలు నానా రకాలుగా అవస్థలు పడ్డారు. నాయకులు జనం సౌకర్యాలను చూడకుండా గాలికి వదిలేసారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇలాంటి బహిరంగ సమావేశాలు జరిగేటప్పుడు జనం సమీకరణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ప్రభుత్వాలను సూచిస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రజాశక్తికి స్థానికులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలానికి జనం సమీకరణ కోసం బస్సులను ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆర్టీసీ వారు మళ్ళించారు. దీంతో నిత్యం బతుకు తెరువు కోసం పల్లె ప్రాంతాల నుంచి జీవన ఉపాధి కోసం తిరుపతికి వందలాదిగా వెళ తుంటారు. గత రెండు రోజులుగా రవాణా సౌకర్యాలు లేక జనం ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి నిలబడినా బస్సులు రాకపోవడంతో నిరాశతో ప్రైవేటు వాహనాలను, ఆటోలను ఆశ్రయించారు. ఇలాంటి సమావేశాలకు ఆర్టీసీ బస్సులను మళ్లించేటప్పుడు ఆయా రూట్లలో ప్రత్యామ్నాయ మార్గాలను చూపి బస్సులను మళ్ళించాలని స్థానికులు అంటున్నారు. తిరుపతి నుండి గ్రామాలకు వెళ్లి వచ్చే సగం పైగా బస్సులు అందుబాటులో లేవు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు జనం సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నారు.

బస్సులు లేక ఆటోలో వెళుతున్న ప్రజలు, బస్సులు లేకపోవడంతో వెలవెలబోయిన కూడళ్లు

ప్రైవేటు వాహనాలలో జన సమీకరణ చేసుకోవాలి

- జగదీష్ , బండారపల్లి గ్రామం, వెదురుకుప్పం మండలం

ప్రభుత్వాలు ఏవైనా సమావేశాలు, మహానాడు లాంటి భారీ సభలు ఏర్పాటు చేసేటప్పుడు జనాలను దృష్టిలో ఉంచుకోవాలి. ప్రైవేటు ట్రావెల్స్‌ను మళ్లించాలి. జనం ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలది. రోజువారీ పనుల నిమిత్తం కూలీలు ఎక్కువగా తిరుపతికి వెళ్లి పనులు చేసుకుని వస్తుంటారు. బస్సులు లేక గత మూడు రోజులుగా ఇబ్బందులు పడుతూ ఆటోలను ఆశ్రయించారు.

పంటలపై జంట ఏనుగులు స్వైర విహారం

భయాందోళనలో అటవీ సమీప ప్రాంత రైతాంగం

ఏనుగులు మామిడి చెట్లను విరిచి, కాయలను ధ్వంసం చేసిన దృశ్యం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని ఎస్.గొల్లపల్లి గ్రామం అటవీ శివార్లలోని పంటపొలాలపై జంట ఏనుగులు స్వైర విహారం చేసి పంటలను ధ్వంసం చేశాయి. బుధవారం రాత్రి గ్రామసమీపంలో ఉన్న నాగభూషణ్ రెడ్డి, గంట్లప్ప గౌడు, రామలక్ష్మి, విశ్వనాథ్, భక్తవత్సల రెడ్డిలకు చెందిన మామిడి తోటలో కొమ్మలు విరిచి, కాయలను నేల రాల్చాయి. మురుగేష్ గౌడు, జయరామప్పలకు చెందిన అరటి తోటలో తిన్నంత తిని తొక్కి నాశనం చేయడమే కాక వ్యవసాయ పరికరాలు కూడా ధ్వంసం చేశాయి. మండలంలో ఏదో ఒక ప్రాంతంలో జంట ఏనుగులు గత నెల రోజుల నుంచి పంటలపై పడి రైతులను అపార నష్టం కలిగిస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కుంకీ ఏనుగుల ద్వారా అటవీ లోతట్టు ప్రాంతానికి మళ్ళించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి తమకు పరిహారం అందివ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు జూన్ 1 నుండి ఆగస్టు 31వ తేదీ వరకు, కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే జూన్ 1 నుండి ఆగస్టు 31 వరకు అక్రిడేషన్ పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్, డిఎంఏసి చైర్మన్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు మెగా యోగా క్యాంపెయిన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 30వ తేదీ శుక్రవారం చిత్తూరు ప్రశాంత్ నగర్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి మెగా యోగా కాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా యోగ కాంపెయిన్ ఉదయం 6.30 నుండి 8 గంటల వరకు జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నాలని తెలిపారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ విజిట్ చేసి యాక్టివ్ బెనిఫిషియారీలతో మాట్లాడి గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై గృహనిర్మాణ సంస్థ పీడీ, ఈఈలు, డీఈలు, ఈఏలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ విజిట్ చేసి యాక్టివ్ బెనిఫిషియారీలతో మాట్లాడి గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేసుకునేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు గృహనిర్మాణ సంస్థ అధికారులు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సక్రమంగా

విధులు నిర్వహించని ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు షోకాస్ నోటీసులు ఇవ్వాలని పీడీని ఆదేశించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణాల మంజూరుపై అవగాహన కల్పించి వెంటనే గృహనిర్మాణాలు ప్రారంబించి పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమన్వయం చేసుకొని గృహనిర్మాణ సంస్థ అధికారు పనిచేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల లబ్దిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు పూర్తి అయిన గృహాలకు సంబంధించి ఎఫ్‌టిఓ జనరేట్ చేసిన బిల్లుల చెల్లింపు పూర్తి చేయాలని పీడీని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గృహనిర్మాణ సంస్థ ఇంచార్జి పీడీ గోపాల్ నాయక్, ఈఈలు, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు అభినందన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జంతు జనన నియంత్రణలో భాగంగా చిత్తూరు నగరంలో నిరంతరం అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమాన్ని ప్రారంభించడం హర్షనీయమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం నిరంతర ఏబీసీ కార్యక్రమాల నిర్వహణపై చిత్తూరు అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, పశుసంవర్ధకశాఖ, మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీధి కుక్కల జనన నియంత్రణకు స్వచ్ఛంద సంస్థ చిత్తూరులో చర్యలు చేపట్టడం హర్షనీయమన్నారు. జంతువులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖ అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. ఈ క్రమంలో జంతువులకు కావాల్సిన ఆహారం, వైద్యసేవల కొరత, ప్రత్యేక షెల్టర్ల ఏర్పాటు తదితర అంశాలను అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, జంతు సంక్షేమ సంస్థలు పరస్పరం సమన్వయం చేసుకొని పనిచేసేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. అదేవిధంగా చిత్తూరు అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి తన వంతు సహాయ, సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చిత్తూరు నగరంలో నిరంతర ఎబిసి కార్యక్రమాన్ని ప్రారంభించిన చిత్తూరు అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అడ్వకేట్ మాలతి, పట్నం మంజునాథరెడ్డి, ఆర్తీ, విజయ, శిరీషలను కలెక్టర్ అభినందించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరిఫ్, చిత్తూరు నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ హరికిషన్, పశు వైద్యులు డాక్టర్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్



రాయితీపై పండు ఈగ బుట్టలు

ప్రజాశక్తి- పుంగనూరు, గంగవరం:

మామిడి పండు ఈగలు నివారణకు సమగ్ర సస్య రక్షణ కింద ఉద్యాన శాఖ పండు ఈగ బుట్టలు రాయితీపై రైతులకు అందుబాటులో ఉంచామని ఆ శాఖ అధికారి వరప్రసాద్ గురువారం ప్రకటనలోతెలిపారు. ఒక బుట్ట, 3చెక్క పీస్(ఎరలు) రూ.11లు (రాయితీతో) అందిస్తామన్నారు. కావలసిన రైతులు రైతుసేవాకేంద్రం సిబ్బందిని కాని ఉద్యాన శాఖ అధికారిని కానీ సంప్రదించొచ్చు అని చెప్పారు. బుట్టలు కావలసిన రైతులు భూమి పాస్ పుస్తకాలు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు ఇవ్వాలి తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి

సమావేశంలో ఏపీఎంలతో మాట్లాడుతున్న డిఆర్డిఏ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలన్నీ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు చేరువకావాలని చిత్తూరు డిఆర్డిఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వాలంబన కోసం అనేక పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయని వీటిని సంఘ సభ్యులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా జిల్లా సమాఖ్య ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో లక్షమంది సంఘసభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈలక్ష్యాన్ని అధికమించాలంటే సంఘాల్లో పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అర్హత ఉన్న సంఘ సభ్యులను ముందుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నెల 30వేల మంది మహిళలను గుర్తిస్తే లక్ష్యాలను అధిగమించే అవకాశం ఉందన్నారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వెదురు, మునగ పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఏడు మండలాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ మండలాల్లో వెదురు, మునగ వల్ల జరిగే ప్రయోజనాలు ఆర్థిక లాభాల పై సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ వ్యాన్ ద్వారా రైతుల పండించిన తాజా కూరగాయలు, సంఘ సభ్యులు చిరుధాన్యాలతో తయారుచేసిన తినుబండారాలు, చిరుధాన్యాలను ప్రజల వద్దకే తీసుకెళ్లి విక్రయించే కార్యక్రమాన్ని తవణంపల్లి మండలంలో చేపట్టడం జరిగిందని, ఈ మొబైల్ వ్యాన్ ద్వారా విక్రయాలు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే సంఘాలు ఆర్థిక లావాదేవీలపై ఎక్కడ అక్రమాల చోటు చేసుకోకుండా చూడాలన్నారు. సంఘాల ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకోవాలన్నారు. వచ్చే నెలలో జరిగే జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎం రవి, ఏపీఎంలు హేమ, సుబ్బారెడ్డి, మధు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సదుం తహశీల్దార్ కార్యాలయంలో 31వ తేదీ శనివారం సాయంత్రం మూడు గంటల నుండి పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జయప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పౌరహక్కులకు సంబంధించిన చట్టాలు, చేపట్టవలసిన చర్యలు గురించి ప్రజలకు తెలియజేసి గ్రామాలలో ప్రజాసమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలస్థాయి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

అందుబాటులో ఉండండి : ఎంపిడిఓ

సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

ప్రజాశక్తి- కార్వేటినగరం
లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు, లబ్ధిదారులకు మెరుగైనసేవలు అందించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో స్నేహభావంతో వ్యహరించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యపరిష్కార మార్గమే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఇన్చార్జి ఈవో పీఆర్డీ నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పలువురు ఉన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

ప్రజాశక్తి- సోమల
సోమల ఇరికిపెంట పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్న మహాభారత యజ్ఞం భారతం మిట్ట లో ఉదయం ద్రౌపతి సమేత పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి ధ్వజారోహణంతో మహాభారత యజ్ఞాన్ని ప్రారంభించారు. మహాభారత యజ్ఞాన్ని తిలకించేందుకు వచ్చే వారి కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కాగా మధ్యాహ్నం మూడు గంటల నుండి హరికథ భాగవతారిని నాగరత్న మహాభారత యజ్ఞంలో మొదటి రోజు సర్పయాగం, వ్యాస జననంతో కథను ప్రారంభించారు. ప్రక్క వాయిద్యాలుగా తబలా డమరేష్, హార్మోనియం సురేష్, కీబోర్డ్ దేవా వాయిద్య సహకారాలను అందజేశారు. హరికథ వినడానికి ప్రజలు మహాభారత యజ్ఞానికి చేరుకొని శ్రద్ధగా విన్నారు.

దశల వారీ కోతతో ఆదాయం

ఉద్యానవన శాఖ అధికారి సాగరిక

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: దశల వారి కోతతో అధిక ఆదాయం చేకూరుతుందని ఉద్యానవన శాఖ అధికారి సాగరిక తెలిపారు. గురువారం మండలంలోని కె.జి.సత్రం వద్ద ఉన్న మామిడి రైతులతో క్షేత్రస్థాయిలో పంట పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి ధరలు, పంట కోయటంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు. ఒకేసారి పంట కోయకుండా పలు దపాలుగా కోయడం వలన అధిక ధరలు పొందేందుకు అవకాశం ఉందని, కాయలకు ఈగలు పడకుండా సబ్సిడీపై బుట్టలు ఇస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడి సాధించొచ్చు అని అన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సహాయకులు ఎగువమూర్తి, మామిడి రైతులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : కడప గడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి చిత్తూరు నియోజకవర్గం నుండి టిడిపి కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. గురువారం ఉదయం చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలం నుంచి వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో మహానాడుకు తరలివెళ్లారు. చిత్తూరు అర్బన్ నుండి 60 బస్సులు, 110 కార్లు, చిత్తూరు రూరల్ నుండి 7 బస్సులు, 15 కార్లు, గుడిపాల మండలం నుండి 11 బస్సులు, 35 కార్లలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, గుడిపాల మండల అధ్యక్షుడు సుబ్బానాయుడు జెండా ఊపి ప్రారంభించారు.

వెదురుకుప్పం: మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి, ప్రస్తవి ఇంచార్జ్ మోహన్ మురళి ఆధ్వర్యంలో మండలంలోని తెలుగు తమ్ముళ్లు కడప జిల్లాలో జరిగే మహానాడుకు తరలివెళ్లారు. గురువారం పసుపు జెండాను చేపట్టి కార్యకర్తలందరు నినాదాలు చేస్తూ బస్సుల్లో కడపకు తరలివెళ్లారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ నుండి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో టిడిపి నేతలు కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి తరలి వెళ్లారు. టిడిపి క్రిస్టియన్ సెల్ జిల్లా కార్యదర్శి శాంత కుమార్, జిల్లా టిడిపి టీఎన్ టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, నరసింహ నాయుడు, మురళి, శ్రీనివాసులు శెట్టి, బాబు నాయుడు, ఫైరోజ్, శంకర్, దేవ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

సోమల: కడప నగరంలో నిర్వహిస్తున్న మహానాడు బహిరంగ సభకు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా తరలి వెళ్లారు. మండలంలోని 15 పంచాయతీలకు మహానాడుకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేయడంతో ఆయా పంచాయతీల పరిధిలోని నాయకులు కార్యకర్తలు బస్సులలో మహానాడు వెళ్లారు. మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉమాపతి నాయుడు, రమేష్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, పార్థసారథి, సతీష్, బాలసుబ్రమణ్యం వెళ్లారు.

కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరం నుండి టిడిపి నాయకులు గురువారం కడపలో జరుగుతున్న మహానాడుకు బస్సులు బయలుదేరి వెళ్లారు. నాయకులు రవి యాదవ్, వాసుదేవరెడ్డి, జగన్నాథం, దామోదరం, సంధాని, నియాజ్ యాకూబ్, కృష్ణయ్య తదితరులు వెళ్లారు.

ఎస్ఆర్ పురం : కడపలో జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాల మేరకు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో 13 బస్సులలో తెలుగు తమ్ముళ్లు గురువారం ఉదయం బయలుదేరారు.

వైసిపి మండల కో కన్వీనర్‌గా చంద్రయాన్

ప్రజాశక్తి- గుడిపల్లి: మండల వైఎస్సార్‌సీపీ కో కన్వీనర్‌గా గుడిపల్లి మండలానికి చెందిన సర్పంచ్ జి.చంద్రయాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భారత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రయాన్ తనపై నమ్మకం ఉంచి తనకు పదవి ఇచ్చిన భరత్‌కి, మాజీ రెస్కో చైర్మన్ సెంథిల్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాల్య వికాసం యోగాతో సాధ్యం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: బాల్య వికాసం యోగాతో సాధ్యమని కుప్పం నియోజకవర్గం ఆయుర్వేదిక్ యోగా శిక్షకులు గణేష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మండల పరిధిలోని చందం సచివాలయంలో చిన్నారులకు యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సాధన మానవాళి జీవన విధానంలో భాగం కావాలని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న చిన్నారులు ఉత్తమ ప్రతిభను కనబరచడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని ఎన్ఆర్ పురం గ్రామపంచాయతీ ఎన్ఆర్‌పురం దళిత వాడలో రెండు రోజుల కితం కురిసిన వర్షం కారణంగా పూరిపాక గోడ పడిపోవడంతో జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న ఆధ్వర్యంలో జ్యోతిలక్ష్మి అనే నిరుపేద మహిళా కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబ నేపథ్యాన్ని, ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని రూ.5 వేలు విలువగల బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. అలాగే ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వసాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు చిరంజీవి, మండల ఉపాధ్యక్షులు చార్లెస్ చందు, సురేష్, పవన్, వజ్రవేలు, మాదాసి వెంకటేష్, అన్నమలై పాల్గొన్నారు.

వి(ఒ)రిగిన విద్యుత్ స్తంభం

విరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల బజారు వీధిలో జామచెట్టు సమీపంలో సోమల -నంజంపేట ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ స్తంభం విరిగిపోయి ఒరిగి ఉండి విద్యుత్ వైర్ల సహాయంతో నిలబడి ఉంది. నిత్యం సోమల నుండి నంజంపేట, పెద్దఉప్పరపల్లి, 81 చిన్నఉప్పరపల్లి పంచాయతీలకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు రద్దీగా తిరుగుతూ ఉంటాయి. విరిగి ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం ఏ సమయంలోనైనా పూర్తిగా విరిగిపోయి రోడ్డుపై వెళ్లే వారి పైన పడితే భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సమస్యను గుర్తించాం...
ఏఈ మహేందర్ రెడ్డి
విరిగిపోయి ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తించామని, విద్యుత్ స్తంభాన్ని నాటేందుకు అవసరమైన ట్రాక్టర్ (స్తంభం నాటేందుకు గుంత త్రవ్వే ట్రాక్టర్) అందుబాటులో లేనందువల్ల ఆలస్యం అవుతోందని ట్రాక్టర్ అందుబాటులోకి రాగానే విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని నాటి విద్యుత్ సరఫరాను అందజేస్తామని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- గంగవరం: లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలకు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో డివిజనల్ లెవెల్ పిసి పిఎన్‌డిటి యాక్ట్ రూల్స్ 1996 సబ్ డిస్టిక్ మల్టీ మెంబర్ కాప్రాప్రియేట్ అథారిటీ కమిటీ మీటింగ్ అండ్ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం పలమనేరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పి.భవాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలమనేరు డివిజన్ పరిధిలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్, ఆర్ఎంపి, పిఎంపి ప్రాక్టీషనర్స్ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, వారి గుర్తింపు రద్దు చేసి క్లినిక్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పలమనేరు డివిజన్ స్థాయిలో పిసి పిఎన్‌డిటి యాక్ట్ గురించి మండల స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయ స్థాయిలోనూ అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీసులు, రెవెన్యూ, విద్యాశాఖ సమన్వయంతో ప్రైవేట్ హాస్పిటల్స్‌పై నిఘా ఉంచాలని ఆదేశించారు. పలమనేర్ డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి సమాన స్థాయిలో తీసుకు రావడానికి అధికారులు కృషి చేయాలని, గ్రామాల్లో బాల్య వివాహాలు, వాటి పర్యవసానాలను గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి జయరాములు, కన్వీనర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, పలమనేర్ డివిజన్లోని ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రిల వైద్యాధికారులు, రేడియాలజిస్ట్, గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, ఎన్జీవోలు, వివిధ శాఖల అధికారులు, సిహెచ్‌వోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
ఇద్దరు మృతి

రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి మండలంలోని బలిజపల్లి సమీపంలో చోటు చేసుకున్నది. సీఐ శ్రీనివాసులు తెలిపిన సమాచారం మేరకు.. బంగారుపాళ్యం మండలం పెరుమల్లపల్లి గ్రామానికి చెందిన అంజయ్య కుమారుడు రమేష్ (41) చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీకి చెందిన తాతయ్య కుమారుడు బాబు (48) ఓ హోటల్లో భోజనం చేసి రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పుస్తకం విలువ అపారం

'ప్రజాశక్తి'తో సప్తగిరి ఎడిటర్ రాధారమణ

ప్రజాశక్తి -తిరుపతి సిటి: 'ధర్మో రక్షితి రక్షిత్ణ అన్నారు పెద్దలు. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని, సమాజాన్ని రక్షిస్తుంది' అని సప్తగిరి మాస పత్రిక ప్రధాన సంపాదకులు డాక్టర్ కోటపాటి రాధారమణ అన్నారు. అక్షరానికి, పుస్తకానికి ఉన్న విలువ అపారమైనదని చెప్పారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆయన 'ప్రజాశక్తి'తో తన అనుభవాలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

ధర్మరక్షణలో ప్రధాన భాగం ధర్మ ప్రచారం. ధర్మాన్ని, సంస్కృతిని, సంస్కారాన్ని మన ముందు తరాలవారు మనకు అందించారు. మనం మన తర్వాతి తరానికి అందించాలి. అక్షరానికి, పుస్తకానికి ఉన్న విలువ అపారమైనది. సామాన్య పాఠకుడికి సైతం హైంధవధర్మం, శ్రీవారి వైభవం అర్థమయ్యేలా ఆధ్యాత్మిక మాసపత్రిక 'సప్తగిరి'ని తీర్చి దిద్దడంలో నా వంతుకషి చేశాను. నా ముందుతరం వారు నాకు అందించిన సత్సంప్రదాయాన్ని నేను నిలిపానని నమ్ముతున్నాను. తిరుమల తిరుపతి దేవస్థానం విస్తతంగా ఆధ్యాత్మిక సాహితీసేవ చేయాలనే సదాశయంలో 'సప్తగిరి' మాస పత్రికను 1949లో బులెటిన్‌గా ప్రారంభించింది. ఇది అంచెలంచెలుగా ఎదిగి, అనేక రూపాంతరాలు చెంది 2014 నాటికి ఆరు భాషల (తెలుగు, తమిళం, కన్నడం, ఇంగ్లీషు, హిందీ, సంస్కతం)లో ప్రచురితమౌతూ, 2016లో పూర్తి రంగులలో రావడం ప్రారంభమైంది. సనాతన ధర్మప్రచారంలో ముందుకు సాగుతున్నది. ఈ 'సప్తగిరి' మాసపత్రికకు నేను ఉపసంపాదకుడిగా 1993, జూలై నెలలో మొట్టమొదట ఉద్యోగంలో చేరాను. అప్పటికే నేను 'యోగా' బోధకుడిగా టిటిడిలో ఉన్నాను. అక్కడి నుంచి 'సప్తగిరి' కార్యాలయానికి ఉపసంపాదకుడిగా వచ్చాను. నాకు అప్పగించిన పనుల్ని ఏవిధమైన పొరబాటు లేకుండా నిబద్ధతలో చేసుకుంటూ పోయాను. నేను 2010 ఫిబ్రవరిలో 'సప్తగిరి' మాసపత్రికకు సంపాదకుడిగా ఉద్యోగోన్నతి పొందాను. డాక్టర్ సి.శైలకుమార్ ప్రధాన సంపాదకత్వంతో 'సప్తగిరి' పత్రిక స్వర్ణ యుగాన్ని చవిచూసింది. మేమిద్దరం కష్ణార్జునుల్లా పత్రికను పాఠకలోకానికి మరింత చేరువ చేశాం. పత్రికతో పాటు, తితిదే ప్రచురణల విభాగం కూడా మా కార్యాలయ పరిధిలోనే ఉండేది. తితిదే సవ్యాఖ్యాన కవిత్రయ మహాభారతాన్ని ముద్రించడం మాకు ఆత్మసంతప్తిని కలిగించిన సంఘటనాంశం. అలాగే పోతన భాగవతం వ్యాఖ్యాన ప్రాజెక్టును ప్రారంభించడం, 2014లో ఒక సంస్కతభాషలో 'సప్తగిరి' మాసపత్రికను ప్రారంభించడం, 40 వేల ప్రతుల నుంచి సుమారు రెండులక్షలకు సప్తగిరి అమ్మకాలు పెంచడం, ఇంకా గోదావరి, కష్ణ పుష్కరాల్లో ప్రత్యేక సంచికలు ప్రచురించడం.. ఇలా ఎన్నో మంచిపనులు 'సప్తగిరి' సంపాదకుడిగా చేశాను. హిందూ ధర్మప్రచార వ్యాప్తికి కషి చేశాము. 2016, జూలైలో తితిదే ప్రధాన సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంకితభావంతో పనిచేశాను. నేను ప్రధాన సంపాదకుడిగా సప్తగిరి మాసపత్రికను నాకు చేతనైనంతలో అభివద్ధిపథంలో నడిపించాను. సప్తగిరి మాసపత్రికను అన్నివర్గాల పాఠకులకు వినూత్న శీర్షికల ద్వారా అత్యంత చేరువ చేయగలిగాను. బాలలకోసం 'బాలసప్తగిరి' అనుబంధపత్రికను వెలువరింపచేశాను. పిల్లలకోసం చిత్రకథ అనే ప్రత్యేకశీర్షికను ప్రారంభించాను. 34 సంవత్సరాల పాటు తితిదేలో అనేక పదవులు నిర్వహంచడం, 'ఉత్తమ ఉద్యోగి' అవార్డును అందుకోవడం నా పూర్వజన్మ సుకతం. నా తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యంగానే భావిస్తాను తప్ప నా ఘనత కాదు. ఇన్నేళ్లు నేనేదైనా చేయగలిగానంటే కేవలం నా ఒక్కడి కషి కాదు, నా సహచర ఉద్యోగులందరూ అందించిన సహకారం, ఉన్నతాధికారులు అందించిన నిరంతర ప్రోత్సాహం. విద్య, ఉద్యోగం, వివాహం తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరగడం శ్రీవారి కపే. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో ఇబ్బందులు శాఖాపరంగా వచ్చినా, శ్రీవారి కపతో వివాదరహితంగా ఇన్నేళ్లూ స్వామి సేవలో పనిచేసి, తరించి, స్వామివారు జీతం రూపంలో ఇచ్చిన ప్రసాదాన్ని స్వీకరించి నన్ను, నా కుటుంబాన్ని వద్ధి చేసుకోగలిగాను. ఆత్మ సంతప్తితో ఉద్యోగ విరమణ చేస్తున్నాను.



పన్నుల భారం.. మోయాల్సిందే.. 'పరివారం'



ఆస్తిపన్ను పెంపుకు రహస్య సర్వే
'లోపాలను' గుర్తించడమే 'వ్యూహం'
కమిషనర్ల నుంచి 'స్వీయ' ధృవీకరణ
తిరుపతి ప్రజలపై రూ.18.25 కోట్ల భారం
'రాయలసీమ'కు రూ.54.80 కోట్ల పైనే..

'ఖజానా ఖాళీ.. మీరు ఏం చేస్తారో తెలియదు.. మాకు ఇంత లక్ష్యం పూర్తవ్వాలి..' అని కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు టార్గెట్ విధించడంతో అధికారులు వ్యూహరచన చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఆశించవద్దని తేల్చి చెప్పేసింది. దీంతో ఏఏ మార్గాల్లో భారం అని తెలియకుండా పెంచి, లక్ష్యం చేరుకోవచ్చో అని కార్పొరేషన్ అధికారులు అన్వేషిస్తున్నారు. ఇందుకుగాను రహస్య సర్వేలు చేస్తున్నారు. పెంచితే ప్రజలతో తంటా.. పెంచకపోతే టార్గెట్లు చేరుకోలేమనే చింత.. దీంతో రాయలసీమ పరిధిలో రూ.54.80 కోట్ల భారం రాబట్టుకోడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో రూ.18 కోట్ల 25 లక్షలు, కడపలో రూ.11 కోట్ల 21 లక్షలు, అనంతపురంలో రూ.9 కోట్ల 80 లక్షలు, కర్నూలులో రూ.15 కోట్ల 54 లక్షలు భారం మోపేందుకు లెక్కలు పక్కాగా సిద్ధమయ్యాయని తెలుస్తోంది.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్
తిరుపతి స్మార్ట్‌సిటీకి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.400 కోట్ల రూపాయలను గత ఐదేళ్లుగా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో చాలా ప్రాజెక్టులు అర్థాంతరంగానే ఆగిపోయాయి. కొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు కేటాయించకనే తిరుపతి స్మార్ట్‌సిటీ పథకం కాలం ముగిసింది. ఒక్క తిరుపతికే కాదు. రాయలసీమ పరిధిలోని కడప, కర్నూలు, అనంతపురం కార్పొరేషన్లకు నిధులను ఇవ్వలేదు. ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకపోగా, ప్రస్తుతం రహస్య సర్వే నిర్వహించి పన్నుల భారం ప్రజలపై మోపి, ఖజానా నింపుకోవాలని చూస్తోంది. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటా సర్వే రహస్యంగా జరుగుతోంది.

తిరుపతి ప్రజలపై రూ.18.25 కోట్ల భారం
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలపై 18 కోట్ల 25 లక్షలు భారం పడనుంది. ఇప్పటికే ఆస్తి పన్నుల రూపంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నుంచి ఏడాదికి 90 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వస్తుంది. ఇది కాకుండా రాష్ట్ర ప్రభుత్వం 18 కోట్ల 25 లక్షలు లక్ష్యం ఇవ్వడంతో ప్రజలను పిండి పిప్పి చేసి వసూలు చేసే కార్యక్రమం మొదలయ్యింది. 2024-25 సంవత్సరం గాను తిరుపతి కార్పొరేషన్ రాష్ట్రంలోనే ఆస్తి పన్నుల వసూళ్లలో మూడో స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుంది. రాయలసీమ వాసులపై 54 కోట్ల 80 లక్షల రూపాయలు భారం పడనుంది. ఆస్తి పన్నులు పెరిగితే అద్దె ఇళ్లల్లో ఉండే వారికి 'అద్దె' పెరిగే ప్రమాదం ఉంది.

మరోవైపు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు టీటీడీ శ్రీనివాసం, విష్ణు నివాసం, మాధవం సంబంధించి సుమారు 100 కోట్ల రూపాయలు ఆస్తి పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టింది. ఈ పన్నులు టిటిడి చెల్లిస్తే తిరుపతి కార్పొరేషన్ ప్రజలపై భారం చాలావరకు తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తిరుపతి కార్పొరేషన్‌కు టీటీడీ చెల్లించాల్సిన ఆస్తి పన్నులు మాత్రం వసూలయ్యే పరిస్థితి లేదు.

ఆస్తిపన్ను పెంపు ఆదాయం ఇలా..

తిరుపతి	రూ.18.25 కోట్లు	కర్నూలు	రూ.15.54 కోట్లు
కడప	రూ.11.21 కోట్లు	అనంతపురం	రూ.9.80కోట్లు

సర్వేలో లోపాలను గుర్తిస్తారట...
పన్ను విధింపులో క్షేత్రస్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి వస్తున్న ఫిర్యాదులపై ప్రక్షాళనకు పురపాలక, పట్టణాభివద్ధి శాఖ చర్యలు చేపటినట్లు పైకి చెబుతోంది.
- ఇళ్లు, భవనాలు ఉన్న వారు ఆస్తి పన్ను చెల్లిస్తు న్నారా? లేదా?
- నిర్మాణ విస్తీర్ణం మేరకే సిబ్బంది పన్ను విధించారా?
- అదనపు అంతస్తులకు పన్ను విధించారా?
-నివాస భవనాలను వాణిజ్య అవసరాలకు విని యోగిస్తున్నారా?

కమిషనర్ల నుంచి స్వీయ ధ్రువీకరణ...
ఇంటింటి సర్వే నెల రోజుల్లో పూర్తిచేసి వచ్చేనెల 15 నాటికి లోపాలను సవరించాలి. తమ పరిధిలో పన్ను మదింపు చేయాల్సిన ఆస్తులేవీ లేనట్లుగా కమిషనర్లు రాష్ట్ర పురపాలక శాఖకు స్వీయ ధృవీకరణ పత్రాలను పంపాలి. దీనిపై రాష్ట్ర బృందాలు ఆకస్మిక తనిఖీ చేపడతాయి. అపుడు ఏవైనా లోపాలు బయట పడితే సంబంధిత కమిషనర్లను బాధ్యులను చేస్తారు.

పన్నులు పెంచితే ఉద్యమిస్తాం
వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి
రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ప్రజలపై ఆస్తి పన్నుల భారం మోపితే చూస్తూ ఊరుకునేది లేదు. తక్షణమే పెంపు యోచనను ఉపసంహరించుకోవాలి. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు నెలనెలా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచేశారు. ప్రజలను భారాల సుడిగుండంలోకి నెట్టొద్దు.

భూపోరాట యోధుడు జక్కా వెంకయ్య

గూడూరు టౌన్: 'అలుపెరుగని భూపోరాట యోధుడు జక్కా వెంకయ్య' అని వక్తలు ఉద్ఘాటించారు. గూడూరు సిపిఎం కార్యాలయంలో జక్కా వెంకయ్య ఏడో వర్ధంతి పురస్కరించుకుని ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షతన నివాళి అర్పించారు. నెల్లూరు జిల్లా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన రథసారథి అని కొనియాడారు. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా మతకలహాలు జిల్లాలో జరగకుండా నిరోధించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. యువతకు ఆయన ఆశయాలు, పోరాటాలు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.వెంకట రామిరెడ్డి, బివి రమణయ్య, ధారా కోటేశ్వరరావు, పామంజి మణి పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు తహశీల్దారు కార్యాలయంలో గురువారం తిరుపతి విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. 2021లో ఏసీబీకి చిక్కిన అప్పటి తొట్టంబేడు తహశీల్దార్ పరమేశ్వర స్వామి కేసు విషయమై తాము తనిఖీలకు వచ్చినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తమకు అవసరమైన ఫైళ్లను తీసుకెళుతున్నట్లు చెప్పారు. అదే ఏడాది ఆత్మహత్య చేసుకుని మతి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ దుర్గాప్రసాద్ మతిపైనా తాము సిబ్బందిని విచారించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ మల్లికార్జున్, సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.